

## సీఆర్‌పీఎఫ్ బలగాలతో వైరాలో పోలీస్ మార్చ్


పోలీస్ మార్చ్‌లో మాట్లాడుతున్న ఏసీపీ రెహమాన్

వైరా టౌన్, అక్టోబర్ 25: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు వైరా నియోజకవర్గ కేంద్రంలో బుధవారం సీఆర్‌పీఎఫ్ బలగాలతో పోలీస్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రెహమాన్ మాట్లాడుతూ.. ఈ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్టమైన పోలీస్ నిఘా ఉంటుందని అన్నారు. అలాగే, ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాల్లో అల్లర్లు జరగకుండా చూడాలని కోరారు. సీఐ సాగర్, సబ్ డివిజన్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, సీఆర్‌పీఎఫ్ బాధ్యులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పాలడుగు గ్రామ అధ్యక్షుడిగా సీతారాములు


గ్రామశాఖ అధ్యక్షుడిగా నియమితులైన సీతారాములు

వైరా రూరల్, అక్టోబర్ 25: మండలంలోని బీఆర్ఎస్ పాలడుగు గ్రామ అధ్యక్షుడిగా ఆరెపల్లి సీతారాములు నియమితులయ్యారు. బీఆర్ఎస్ ప్రస్తుత, మాజీ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, ఇరుపార్సపు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో గ్రామంలో బుధవారం ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం కోసం కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. అనంతరం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా నియమితులైన ఆరెపల్లి సీతారాములుకు నియామక ఉత్తర్వులను అందజేశారు. పార్టీ నాయకులు లాల్‌మహ్మద్, గుండెపోగు జాన్, శీలం వెంకటరెడ్డి, రామకృష్ణ, మీర్జే, వేల్పుల మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## యువ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదానం చేసిన అనంతరం యువకుల విజయ సంకేతం

వైరా రూరల్, అక్టోబర్ 25: యువ భారత్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వల్లాపురం గ్రామంలో వల్లాపురం యువత సహకారంతో బుధవారం ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఇన్‌చార్జి శ్రీను మాట్లాడుతూ.. గవర్నమెంట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నిరుపేదలకు సమయానికి రక్తం అందించాలని ఉద్దేశంతోనే ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

# సీఎం కేసీఆర్‌తోనే ఎస్సీల అభివృద్ధి

- వైరా నియోజకవర్గంలో దళితబంధు అమలుకు కృషి చేస్తా
- ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ వైరా అభ్యర్థి మదన్‌లాల్


కనకరత్నాన్ని శాలువాతో సన్మానిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్

వైరా టౌన్/ వైరా రూరల్, అక్టోబర్ 25: సీఎం కేసీఆర్‌తోనే ఎస్సీల ఆర్థికాభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ పేర్కొన్నారు. ఎస్సీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలుచేస్తున్నారని అన్నారు. వైరాలో పరుచూరి గార్డెన్‌లో బుధవారం జరిగిన వైరా మండలం, మున్సిపాలిటీలోని మాదిగ సంఘాల ముఖ్య నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దళిత కుటుంబాల అభివృద్ధి కోసం దేశ చరిత్రలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ చేయని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని అమలు చేస్తోందని వివరించారు. రూ.10 లక్షలతో ఆర్థిక చేయూతను అందించి వారు వ్యాపార రంగంలో రాణించేందుకు తోడ్పాటునందిస్తోందని వివరించారు. అదేవిధంగా తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వైరా నియోజకవర్గమంతా దళితబంధు పథకం వర్తించేలా కృషి చేస్తానని అన్నారు. తద్వారా నియోజకవర్గంలోని దళితులందరినీ ఆర్థికంగా బలోపేతం చేస్తానని అన్నారు. అలాగే, ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకొచ్చిన ఎన్నికల మ్యానిఫెస్టో ప్రజలకు మరింత ఉపయోగంగా ఉంటుందని అన్నారు. దీనిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మాదిగల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ.. వారికి అండగా ఉంటానని అన్నారు. ఈ ఎన్నికల్లో తనను ఆదరించి కారు గుర్తుపై ఓటు వేసి తనకు అధిక మెజార్టీ అందించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు యాతాకుల భాస్కర్‌రావు, డాక్టర్ కోటయ్య, దారెల్లి పవిత్రకుమారి, తడికమళ్ల నాగేశ్వరరావు, బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, లాల్‌మహ్మద్, చిలకా కోటయ్య, కోట ఏలీషా, ఆదూరి ప్రేమ్‌కుమార్, దాసరి శ్రీనివాసరావు, వేల్పుల మురళి, నంది గామ మనోహర్, అయినాల కనక రత్నం, మన్నెం సత్యానందం, మోటపోతుల సురేశ్, అప్పం సురేశ్, కామినేని శ్రీనివాసరావు, దొంతెబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మదన్‌లాల్ గెలుపునకు కృషిచేయాలి: బీఆర్ఎస్



బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్ విజయం కోసం కొణిజర్ల, కారేపల్లి మండలాల్లో ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు

కొణిజర్ల/ కారేపల్లి, అక్టోబర్ 25: బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ అభ్యర్థి మదన్‌లాల్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులంతా బీఆర్ఎస్‌కు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ అభ్యర్థి మదన్‌లాల్‌కు అధిక మెజార్టీ అందించాలని కోరుతూ నాయకులు, ప్రజాప్రతినిధులు కొణిజర్ల, కారేపల్లి మండలాల్లో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అద్భుతమైన పథకాలతో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. ఆయన పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందాయని వివరించారు. ప్రతి కుటుంబానికీ ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూరిందని అన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకున్న లబ్ధిదారులు, అభివృద్ధిని గమనించిన ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని, బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కొణిజర్ల మండలంలో జరిగిన ప్రచారంలో పోట్ల శ్రీనివాసరావు, పెద్దపోలు జానకీరాములు, సవళ్ల జానకీరాములు, సవళ్ల లాలయ్య, ఇనుకొండ సందీప్, కొమ్ము జయపాల్, జట్ల వెంకన్న, కోవిన్ని హనుమంతు, పగడాల నగేశ్, కోవిన్ని గోపాలరావు, కొమ్ము ఈసాక్, బోలమాల అరుణ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కారేపల్లి మండలంలో జరిగిన ప్రచారంలో శకుంతల, జగన్, ఉమాశంకర్, శ్రీనివాసరావు, రమేశ్, ఉన్నం వీరేందర్, లక్ష్మణ్, కిశోర్, బానోత్ శంకర్, బానోత్ మట్కు, బత్తుల శ్రీనివాసరావు, కిరణ్, చందర్ పాల్గొన్నారు.

## ఖండాంతరాలు దాటిన బతుకమ్మ సంబురాలు


యూకే వర్సిటీలో బతుకమ్మ వేడుకల్లో తెలంగాణ విద్యార్థినులు

కొణిజర్ల, అక్టోబర్ 25: తెలంగాణ సాంస్కృతిక పండుగ బతుకమ్మ వేడుక ఖండాంతరాలు దాటింది. మండలానికి చెందిన పలువురు విద్యార్థినులతోపాటు, తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు యూకేలోని లెస్ సెంటర్‌లో లక్సర్ యూనివర్సిటీలో చదువుకుంటున్నారు. దసరా వేడుకల ముగింపు సందర్భంగా తెలంగాణ పూల పండుగ అయిన బతుకమ్మను యూనివర్సిటీ ప్రాంగణంలో బుధవారం పేర్చారు. బతుకమ్మ చుట్టూ సంప్రదాయ నృత్యం చేస్తూ ఆటపాటలతో అలరించారు. సుమారు 2 గంటలపాటు జరిగిన ఈ వేడుకలను అక్కడ వివిధ దేశాలకు చెందిన తోటి విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. తెలంగాణ సంస్కృతిని ప్రశంసించారు. సాహితీచంద్ర, హిమబిందు, పూజిత, అలేఖ్య పాల్గొన్నారు.

## వైరాలో దుర్గామాతకు వైభవంగా శోభయాత్ర

వైరా టౌన్/ కారేపల్లి, అక్టోబర్ 25: వైరాలోని శ్రీకోదండ రామస్వామి దేవాలయంలో దసరా పండుగ సందర్భంగా శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శరన్నవరాత్రి వేడుకల ముగింపు సందర్భంగా వైరా పట్టణంలో దుర్గాదేవి శోభయాత్రను వైభవంగా జరిపారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం నల్లచెరువులో దుర్గామాతను నిమజ్జనం చేశారు. కారేపల్లి మండలంలోనూ దుర్గామాత నిమజ్జనాలు బుధవారం ఘనంగా జరిగాయి.



వైరాలో శోభాయాత్రగా బయలుదేరిన అమ్మవారు, కారేపల్లిలో శోభాయాత్ర ముందు కోలాటం వేస్తున్న మహిళలు

## పొంగులేటి బంధువు ఇంట్లో భారీగా వాల్ క్లాక్‌లు

- రూ.47 లక్షల విలువైన 9,570 గోడ గడియారాలు స్వాధీనం
- ఖమ్మంలో ఫ్లయింగ్ స్క్వాడ్, టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు



దయాకర్‌రెడ్డి ఇంట్లో నిల్వ చేసిన గోడ గడియారాల బాక్సులు

ఖమ్మం, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): శాసనసభ ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రభావితం చేసేందుకు కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలకు ఫ్లయింగ్ స్క్వాడ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు చెక్ పెట్టారు. మాజీ ఎంపీ, కాంగ్రెస్ ఎన్నికల ప్రచార కమిటీ కో-కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీప బంధువు, ఖమ్మంలోని దయాకర్‌రెడ్డి ఇంట్లో బుధవారం దాడులు చేసి రూ.46 లక్షల విలువైన గోడ గడియారాలను పట్టుకున్నారు. మాజీ ఎంపీ పొంగులేటి పాలేరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు. అయితే ఆయన అభ్యర్థిత్వం ఖరారు కాకముందే అనుచరులు ఆయనే అభ్యర్థి అంటూ ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకే ముందస్తుగా ఈ వాచ్‌లను సిద్ధం చేసి భద్రపరిచినట్లు ప్రచారం జరుగుతోంది. గడియారాల కొనుగోలుకు సంబంధించి బిల్లులపై ఎన్నికల అధికారులు ఆరా తీయగా.. సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో వాటిని సీజ్ చేశారు. దయాకర్‌రెడ్డి ఇంట్లో పెద్ద ఎత్తున వాచ్‌లు దొరకడం రాజకీయంగా కలకలం రేపుతోంది. తనిఖీల్లో రూ.46.89లక్షల విలువ చేసే రూ.9,570 గోడ గడియారాలను అధికారులు సీజ్ చేశారు. గడియారాలకు సంబంధించి బిల్లులు, ఇతర ఆధారాలు చూపించాలని అధికారులు కాంగ్రెస్ నాయకులను అడిగినప్పటికీ సమాధానం అందించలేదని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సుమ తెలిపారు. కాగా.. వాచ్‌లపై పొంగులేటి ఫొటోతో తన కూతురు వివాహం సందర్భంగా.. అని ముద్రించి ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

## విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై విద్యుత్ ఏడీఈ ఫిర్యాదు

వైరా టౌన్, అక్టోబర్ 25: విద్యుత్ శాఖ విధులకు ఆటంకం కలిగిస్తూ అసభ్యంగా పదజాలంతో దూషించిన వ్యక్తిపై వైరా విద్యుత్ శాఖ ఏడీఈ రామకృష్ణ వైరా పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఆయన కథనం ప్రకారం.. తాను విధి నిర్వహణలో ఉండగా.. మండలంలోని ముసలిమడుగుకు చెందిన కొరివి నర్సరావు అనే వ్యక్తి తన విధులకు పూర్తిగా ఆటంకం కలిగించాడు. పైగా తనను అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో వైరా ఏడీఈ రామకృష్ణ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.